

'మిత్రవింద'

"అంగదా ?"

"స్వామీ !"

"నువ్వు రాజకుమారుడివి గదా ? నాకు శిష్యరికం చేస్తానంటావేం ?"

"రాచరికం ఇంకెక్కడుంది ? రాజులూ పోయె ! రాజ్యాలూ పోయె !"

"అయినా నీలో ఇంకా ఆ లక్షణాలు పూర్తిగా పోయినట్టు కన్పించడంలేదు. నీలో నాకు సంజయ్ గాంధీ పోలికలు కన్పిస్తున్నాయ్ !"

"ఏం చెయ్యను స్వామీ ? ఉగ్గు పాలతో రంగరించి పోసిన లక్షణాలు అంత త్వరగా పోతాయా ? పైగా కొంత కాలం యూత్ కాంగ్రెస్‌లో పని చేశాను. అందుకే నీ శిష్యుడిగా చేరి ఉదతా భక్తిగా దేశసేవ చెయ్యాలని ఉంది."

"అలాగే అంగదా ! నేను ఎక్కడికంటే అక్కడికి వెళ్లలేను. ఈ వృద్ధాప్యంలో, పైగా తోక ఒకటి ! అవును ! అడగటం మర్చాను ! నీ తోక ఏమైందీ?"

"సర్జరీ చేయించాను."

"అంటే ?"

"కోయించేశాను."

"మరి నీ ముఖం కూడా మనిషి ముఖం లాగే ఉందే ?"

"ప్లాస్టిక్ సర్జరీ చేయించాను."

"అదేమిటోయ్ ?"

"అమెరికాలో చేస్తారు. ముఖంలో ఎలాంటి అవకతవకలున్నా సరిచేస్తారు. తోకతో, కోతి ముఖంతో తిరగడం కష్టమైపోయింది. అందుకే చేయించాను."

"ఈ కలియుగంలో మనిషి, మహా మనిషిగా ఎదిగిపోయాడు. కాని ఏం లాభం మనిషిగా కుంచించుకు పోతున్నాడు. అంగదా? ఏమిటా గందరగోళం ? ఎక్కడికెళ్తున్నారు అంత జనం... కార్లలో - కాలినడకతో? "

"అశ్వమేధానికి స్వామీ ?"

"అశ్వమేధమా ? ప్రజాస్వామ్యంలో అశ్వమేధం ఎవరు చేస్తారయ్యా? ఆం మర్చిపోయాను. ప్రభుత్వం మారిందిగా ? జనతా ప్రభుత్వం సంస్కృత పండితుల్ని సత్కరిస్తుందని విన్నాను. మరణావస్థలో ఉన్న సంస్కృతానికి అమృతం తాగించడానికి ప్రయత్నం జరుగుతోందట ! అశ్వమేధ యాగాలు కూడా చేస్తున్నారన్న మాట ! బాగు ! బాగు !"

"నీ త్రేతాయుగపు అయోమయం పోకుగానూ ! అశ్వమేధం అంటే రేసెస్..."

"ఓహో ! కిరణాలా ? సూర్య కిరణాలను పూజిస్తారా ? ఈ యుగంలో కూడా మా గురువుగార్ని దేవుణ్ణిగా భావించి

పూజించే వాళ్లు ఇంకా ఉన్నారన్న మాట!"

"నీ వచ్చీరాని ఇంగ్లీషుతో నన్ను చంపకు! రేవెస్ హార్స్‌రేసెస్ అంటే గుర్రప్పందాలు. సరదాకు అశ్వమేధం అంటారు."

"అయితే ఉండు నేను కూడా వెళ్ళి అదేమిటో చూసొస్తా!"

"అయ్యయ్యో! నువ్వెళ్ళకు! వెళ్ళకు!"

"ఏమిటలా గాభరా పడ్తావ్? ఏం నే వెళ్తే?"

"మహా చెడ్డ వ్యసనం - ఒక్కసారి అందులో పడ్డావా..."

"ఎవరితో శిష్యా నువ్వు మాట్లాడుతున్నది? నాకు వ్యసనం ఏమిటి?"

"అందులో ఉన్న థ్రిల్ నీకేం తెలుసు త్రేతా యుగపు బాదస్తుడికి? ఆ థ్రిల్‌తో ఎందరెందరు సర్వనాశనం అయ్యారో, ఎన్ని కుటుంబాలు కూలిపొయ్యాయో నీకేం తెలుసు? పేపర్లూ పాడూ చదివే అలవాటు లేదయ్యే?"

"మరి ఇటువంటి వాటిని ప్రభుత్వం ఎందుకు నిషేధించదూ? అయితే నేను తప్పక వెళ్ళి అవసరం అయితే తోకను ఉపయోగిస్తా!"

హనుమంతుడు, అంగదుడు వారిస్తున్నా వినిపించుకోకుండా తోకను షర్టులో దూర్చి పీఠను అంగదుడికిచ్చి బయలుదేరాడు. గేట్లో జన ప్రవాహాన్ని చూసి, పక్కకు వెళ్ళి గోడ దూకి లోపల ప్రవేశించాడు.

"కమాన్...కమాన్!"

"కమాన్...క్యూపిడ్!"

"కమాన్...లేపాక్షి!"

జనం కుర్చీలలో నుంచి లేచి, గరుత్మంతుడి రెక్కల్లా చేతులు ఊపుతూ కే[illegible] పెడుతున్నారు.

"ఏమిటయ్యా ఇంత గోలా?" పక్కన ఉన్న అతని కేసి చూస్తూ అన్నాడు హనుమాన్.

"గోలా? గుర్రప్పందాలకు వచ్చి గోల అంటా వేమయ్యా?" అదేమిటి? నీ వీపు వెనక అదేదో కదులుతోంది?

"తోక లేవయ్యా? ఎందుకలా అరుస్తావ్?"

"తో...తో...తోకా?"

"అవును తోకే! ఏమిటలా నోరు తెరిచేశావ్? ఆ తోకే నా ప్రత్యేకత ఆ గుర్రాలకు మాత్రం తోక ల్లేవూ? అసలు తోకలు చూట్టానికేగా పెళ్ళాం మెడల్లో పుస్తెలు కూడా అమ్ముకొని ఇక్కడ చేరుతున్నారు? భయపడకు. తోకను మడత పెట్టి చొక్కాలోకి దూర్చానుగా? నా పేరు హనుమంతుడు."

"శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం. ప్రభా దివ్యకాయం"

"చిరంజీవీ మెచ్చితిని. నువ్వెవరవు?"

"నా పేరు రామన్న! నేను కవిని!"

"ఎట్టెట్టా నువ్వు కవివా! నేను నమ్మను!"

"అదేమిటి స్వామీ! నా కవిత్వానికి ఎన్నో బహుమతులు వచ్చాయి. చర్మభూషణ కూడా ఇచ్చారు."

"నీకూ చాలా తోకలున్నయన్నమాట! అయితే నీకిదేం జబ్బయ్యా? కవిత్వంతో ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన వాడివి, ఇలాంటివి నిషేధించాలని బోధించాల్సిన వాడివి, నువ్వే ఈ పందెంకు వచ్చావ్? అవ సరే! ఆ గ్లాసులో దేమిటి?"

"ఇది...ఇదా...కల్లు స్వామీ!"

"కల్లా అంటే!"

"దీన్నే ఇక్కడ గుడుంబా అంటారు?"

"అంటే...సరిగా చెప్పవయ్యా!"

"అదే స్వామీ... మీ యుగంలో సోమ

పానం చేసేవాళ్లేగా? అలాంటిదే ? ''

''ఓహో ఏ కవిత్వానికి ఇది కూడా కావాలా ? ఏదీ ఇలా ఇవ్వు ! కలియుగ సోమ పానం రుచి ఎలా ఉంటుందో ! ''

''అయ్యోయ్యో ! నాకు లేకుండా అంతా తాగేస్తున్నా వేమయ్యా ! ఇక చాలు. అసలే కోతివి. కల్లు కూడా తాగితే ! అయ్యో తాగేశావా ? ''

''అవేం గుర్రాలయ్యా చచ్చు గుర్రాలు అలా పరిగెడుతున్నాయ్ ? మా కాలంలో రధాల పందాలు ఉండేవి—మా శ్రీరాముని తండ్రి పది తడవలు రధాల పందేల్లో గెల్చాడు. అందుకే దశరధుడు అనే పేరు వచ్చింది.''

''క్యూపిడ్ కమాన్! '' రామన్న ఉత్సాహంగా లేచి అరిచాడు.

''కూర్చోవయ్యా ! కూపడ్ ఏమిటయ్యా ? ''

''క్యూపిడ్, కింగ్ ఆఫ్ పర్స్, కాసానోవా, లేపాక్షి...గుర్రాల పేర్లు.''

''ఇవేం పేర్లయ్యా ? ఇంత కంటే లంకలో మా రాక్షసుల పేర్లే బాగుండేవి ? అయినా ఈ కేకలు ఏమిటి ? ఆ గంతులేమిటీ ? కల్లు తాగినా, కోతినైనా నేనే నయమే ! ''

''నీకేం తెలుసు ఇందులో థ్రిల్ ! జాక్‌పాట్ కడితే తెలుస్తుంది. పది లక్షలు... రెండు రోజుల ఎమౌంట్ క్యారీడ్ అయింది ఇవ్వాళ నిజాం కప్...''

''ఎవరా నిజాం? ఏమా కధ''

''అయ్యా నేను చరిత్ర ఉపాధ్యాయుణ్ని కాను కాస్త మీరు ఆ పక్కకు పోయి కూర్చుంటారా స్వామీ ? ''

చరిత్ర కూడా తెలియని వాడివి ఆ కవిత్వం ఏదో ఏడవక ఈ గుర్రప్పందాలకు ఎందుకొచ్చావయ్యా ? ''

''బుద్ధి గడ్డితిని...నాలుగు రాళ్ళు సంపాదించు కుందామని వచ్చాను. ఇక అంతే ! ఈ వ్యసనం నుంచి బయట పడలేక పోతున్నాను.''

''కనీసం ఆ రాళ్లయినా సంపాదించు కున్నావా?''

''అయ్యో అంత అదృష్టమా ! ఈ వ్యసనం లేకపోతే ఈ పాటికి బ్యాంకులో కనీసం ఓ పది వేలైనా ఉండేవి.''

''ఆడవాళ్ళు కూడా ఉన్నారే ! ''

''ఆడవాళ్ళకే ఈ గుర్రాల మోజు ఎక్కువ. చూస్తున్నావా...వాళ్ల వేషాలూ... వాళ్ళూనూ...''

''చచ్చు దద్దమ్మలా ఆ పరుగులేమిటీ ఆ గుర్రాలేమిటీ ! వాటి కంటే నేనే బాగా పరిగెత్తుతానే ! ''

''ఇదేం సముద్రం దాటట మనుకున్నావా ! ''

జీల కర్ర...చూడు మరి...''

''అయ్యో అదేమిటి ఆలా పిల్లిలా అయిపోయావ్ ! హనుమాన్ ... ఏమయ్యా హనుమాన్ ఆగు. జాక్‌పాట్ పాడుచెయ్యకు... ఇంకెక్కడి హనుమంతుడు... ఆ గుర్రాల కంటే ముందు దౌడు తీస్తున్నాడు. గుర్రాలు బెదిరి పోయాయి. ఛ ! ఛ ! అంతా పాడు చేశాడు.''

''ఏమయ్యా కపీ ! నేనే గెల్చాను. ఆ నిజాం కప్పేదో నాకే ఇప్పించు.''

రామన్న ఏడుపు ముఖం పెట్టాడు.

''ఇప్పిస్తావా లేక ఈ తోకతో చుట్టి బాదమంటావా ! ''

''స్వామీ నన్ను వదిలెయ్ ! ''

''మరి నువ్వు ఈ గుర్రప్పందాలను వదిలేస్తావా ! ''

''వదిలేస్తా స్వామీ ! '' •